క్లుప్తంగా

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



పంచముఖ గాయత్రీ మాత సన్నిధిలో అక్షింతలకు పూజలు చేస్తున్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్‌లో అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు జరిపారు. స్థానిక పంచముఖ గాయత్రీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీలోని ప్రతీ ఇంటికి పవిత్ర అక్షింతలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

పెందుర్తి: నగరంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కె.అన్వేష్‌సాయి, ఎం.మణిదీపక్, మొహత్తర్ ఇస్లాం, కల్పన బహుమతులు సాధించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

శాస్త్రోక్తంగా గాయత్రీ హోమం



హోమంలో పాల్గొన్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని వేదమాత గాయత్రీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కెంగం గురుస్వామి ఆధ్వర్యంలో గాయత్రీ హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపి కుంకుమ పూజలు చేశారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఏఎంసీ డైరెక్టర్ అయిత ఎర్రయ్య, నాయకులు కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట గోవింద్, అయిత అప్పలరాజు, బొట్ట రాము, భక్తులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్‌కు ఇండికేటర్ల ఏర్పాటు



ఇండికేటర్స్ ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రమేష్

పెందుర్తి: స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనదారులు రాత్రి సమయంలో ఇబ్బందులు పడకుండా పెందుర్తి కూడలి నుంచి సాధుమఠం వరకు ఉన్న బ్రేకర్ల వద్ద స్థానిక వెలమతోట యూత్ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఇండికేటర్లను ఏర్పాటు చేశారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.అశోక్‌కుమార్, పెందుర్తి ఎస్‌ఐ జి.రమేష్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ ధ్యేయం

పెదగంట్యాడ: కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ ధ్యేయమని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మి క సంఘ నాయకునిగా ఉంటూ ఎన్నో సమస్యలను పరిష్కంచానని తెలిపారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అవతారం, బీఎన్ రాజు, కారి పెంటయ్య, సత్యరావు, రమేష్, పల్లం గోపీ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- వైభవంగా సుదర్శన హోమం
- పూజల్లో పాల్గొన్న శ్రీశారదాపీఠాధిపతి, ప్రముఖులు
- వెంకటాద్రికి పోటెత్తిన భక్తజనం

పెందుర్తి: గోవింద నామస్మరణతో పెందుర్తి పులకించింది. భక్తజనంతో వెంకటాద్రి పోటెత్తింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటాద్రిపై సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు చేశారు. 22వ రోజు తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో వెంకన్న దర్శనమిచ్చారు. అష్టోత్తర పూజ, మంగళహారతి ఇచ్చారు. గోపూజ, గోదాదేవి సన్నిధిలో వ్రతం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ సమక్షంలో వేదపండితులు శాస్త్రోక్తంగా సుదర్శనహోమం చేశారు. స్వామీజీ చేతుల మీదుగా



పూజలందుకున్న వెంకన్న ఉత్సవమూర్తులు

పూర్ణాహుతి జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో దాదాపు 1500 మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తీసుకువచ్చిన వివిధ రకాల పూలతో స్వామిని అభిషేకించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేల మంది భక్తులు వెంకన్న ప్రసాదం స్వీకరించారు.



హోమంలో పాల్గొన్న శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత, పలువురు నాయకులు, వేలాదిగా భక్తులు క్రతువులో పాల్గొన్నారు. ఈవో నీలిమ వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్





వెంకన్నకు పూజలు చేస్తున్న అర్చకుడు, కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేయిస్తున్న అర్చకుడు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వేడుకగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. అడవివరంలోని మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ విద్యలో రాణించి తల్లిదండ్రులకు, విద్యా సంస్థకు, దేశానికి మంచి పేరుతేవాలని సూచించారు. ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలంరించాయి. కార్యక్రమంలో మౌంట్ డియోస్ ఎడ్యుకేషనల్ సొసైటీ



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రెసిడెంట్, ఆర్టీఐ మాజీ కమిషనర్ డాక్టర్ ఎం.వి జయనిర్మల, సెక్రటరీ ముత్తంశెట్టి కృష్ణారావు, సీఈవో ఎం. అఖిల, ప్రిన్సిపాల్ ఎం. భార్గవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెందుర్తి: విశాఖ నగర నేవల్ టెక్నికల్, నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండలంలోని పులగానిపాలెంలో ఆదివారం కో ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రామారావు రిటర్నింగ్ అధికారిగా ఎన్నికలు జరిగాయి. సొసైటీ ప్రెసిడెంట్‌గా బి.తాతారావు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటేశ్వరరావు, సెక్రటరీగా టి.శివరాజు, ట్రెజరర్‌గా ఎం.ప్రభాకర్‌రావు, డైరెక్టర్లుగా ఎంసీఎస్‌వీ ప్రసాద్, బి.వి.ఎస్ అప్పారావు, టి. కాంతారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బి.తాతారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం దిశగా నూతన కార్యవర్గం పని చేస్తుందని పేర్కొన్నారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు

శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు. రెటీనా, గ్లకోమా,కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య స్వేలు అందించామన్నారు. 2023లో గ్లకోమా



శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

దీక్షలకు మద్దతు

పరవాడ: ఫార్మా వ్యర్థాల కారణంగా మత్స్య సంపద నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ 29 రోజులుగా రైతులు చేస్తున్న నిరసన దీక్షలకు ఆదివారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్లి రామునాయుడు రైతుల న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ పట్టాబి ప్రసాద్, నాయకులు బి.ఎం.ఎస్.నాయుడు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితులకు రిమాండ్

వేర్వేరు ఘటనల్లో 11 కేజీల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు సంయుక్తంగా దాడులు నిర్వహించగా తమిళనాడులోని మదురై ప్రాంతానికి చెందిన కాజా మైదీన్ ఇబ్రహిం, కర్నాటక బెంగుళూరుకు చెందిన మనీష్, చేతన్‌కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను ఊర్వశి జంక్షన్ వద్ద పట్టుకుని వారిని విచారించారు. అరకు నుంచి గంజాయిని బెంగుళూరుకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జల్సాల కోసం..

విలాసాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలనే నెపంతో గుంటూరుకు చెందిన సింగు యోగేష్‌బాబు అనే యువకుడు తనకు కొత్తగా పరిచయమైన హనీష్ వర్మ అనే స్నేహితుడు ఇచ్చిన సలహా మేరకు గంజాయి విక్రయించాలనుకున్నాడు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అతడు గంజాయి తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా జ్ఞానాపురం ఫ్లై ఓవర్ వద్ద యోగేష్‌బాబును పట్టుకుని విచారించారు. అరకులోని పరశురాం అనే వ్యక్తి వద్ద 6 కేజీల గంజాయి కొని గుంటూరు తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. అతడి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు మిగతా వ్యక్తుల కోసం కేసు దర్యాప్తు చేపట్టారు.

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో పర్యాటకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. అనకాపల్లి, కూర్మన్నపాలెం, లంకెలపాలెం, సబ్బవరం, అగనంపూడి, దేశపాత్రునిపాలెం తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు తీర ప్రాంతాలకు చేరుకున్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో సందడి చేశారు. మధ్యాహ్నం తీరంలో స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు.

అ'పూర్వ' కలయిక



ఆత్మీయ కలయికలో పెందుర్తి ప్రభుత్వ పాఠశాల 1982 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పెందుర్తి: వారు దాదాపు నాలుగు దశాబ్దాల కిందట కలిసి చదువుకున్నారు. కొందరు ఫారిన్‌లో.. కొందరు ప్రజాప్రతినిధులుగా.. ఇంకొందరు ఇతర రాష్ట్రాల్లో.. మరికొందరు అధికారులుగా.. వ్యాపారస్తులుగా స్థిరపడ్డారు. వారంతా ఆదివారం కలిసి సందడి చేశారు. 1982లో పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా మండలంలోని పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆదివారం కలిసారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆడిపాడి సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఎన్నో మధురమైన జ్ఞాపకాలను మూటకట్టుకుని వీడ్కోలు తీసుకున్నారు.

బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి



ఆత్మీయ సదస్సులో బ్రాహ్మణ ప్రతినిధులతో ద్రోణంరాజు శ్రీవాత్సవ

పెందుర్తి: బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత ద్రోణంరాజు శ్రీవాత్సవ అన్నారు. ఆదివారం సాయంత్రం సుజాతనగర్‌లోని ద్రోణంరాజు సత్యనారాయణ సామాజిక భవనంలో బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాత్సవ మాట్లాడుతూ రాజకీయంగా బ్రాహ్మణులు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.

ఫిబ్రవరి 4న నగరంలో బ్రాహ్మణ ఐక్యత కోసం విప్రోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామని.. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి బ్రాహ్మణులంతా తరలిరావాలని కోరారు. బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం దివంగత నేతలు ద్రోణంరాజు సత్యనారాయణ, ద్రోణంరాజు శ్రీనివాస్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. పలు అంశాలపై ప్రతినిధులు చర్చించారు. కార్పొరేటర్ రాపర్తి కన్నా, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పి.నారాయణరావు, కేశప్రగడ వెంకటనరసింహమూర్తి, కావూరి చరణ్‌కుమార్, రామభద్రుడు, గాడేపల్లి ప్రభాకరరావు, చాడ రవికిరణ్, వద్దాది ఉదయ్‌కుమార్, చిన్న శ్రీను, సన్యాసిరాజు, వేదుల హనుమంతరావు, బిల్వపత్ర ట్రస్ట్ ప్రతినిధి రవిశంకర్, చెక్క పురోహిత సంఘం ప్రతినిధులు నాగశాస్త్రి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్యావధానం

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వినూత్నంగా నిర్వహించిన హాస్యావధానం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా వినోదాల విందులో భాగంగా అవదాన కార్యక్రమం నిర్వహించారు. జె.ఎల్.నరసింహం(అవధాని) , కామేశ్వరరావు(చమత్కార కవి, అప్రస్తుతం), ఎం.వి.సుబ్రహ్మణ్యం(సమన్వయం) పాల్గొన్నారు. పృచ్ఛకులుగా నండూరి రామకృష్ణ(సందేశం), డాక్టర్ రజని(దత్తపది) జబర్దస్త్ ప్రకాష్(ఆశువు), డేవిడ్‌రాజు(పేరడీ), శివజ్యోతి (వర్ణన), తులసి గణేష్(విచిత్ర అంశం) పాత్రలు పోషించారు. సంధ్యా ప్రియదర్శిని, ఎస్.ఎస్.నాయుడు, సభికులు కురిపించిన ప్రశ్నలకు అవధాని హాస్యం జోడించి చెప్పిన సమాధానాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, పురుషోత్తం, సన్‌మూర్తి, దాడి సత్యనారాయణ అతిథులుగా పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. ఇటీవల రెండు సార్లు ఉత్తమ హాస్య నటుడిగా నంది అవార్డు అందుకున్న డేవిడ్‌రాజును సన్మానించారు. ఇక నుంచి ప్రతి నెలా ఒక హాస్య నటుడికి రేలంగి ఆత్మీయ సత్కారం చేసి, వార్షికోత్సవంలో రేలంగి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేస్తామని ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ప్రకటించారు.



హాస్య అవధానం చేస్తున్న కామెడీ క్లబ్ కళాకారులు

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ భానుప్రకాష్ శ్రీవాస్తవ, ఏపీ జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ భాను ప్రకాష్ శ్రీవాస్తవ దంపతులు, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

ఉత్తరాంధ్ర కల్పవల్లికి విశేష పూజలు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 25వ రోజు కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల 500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నమాచార్య కీర్తనలు, భక్తి రంజని, కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

కేంద్రం నిర్ణయాలతో కార్మికులకు అన్యాయం



దీక్షా శిబిరంలో నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కుటిల నిర్ణయాలకు కార్మికులు బలవుతున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరగడంతో అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1060వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని భారత ప్రధాని నరేంద్రమోడీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి, అమ్మే హక్కు లేదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. పోరాట కమిటీ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.